ప్రజాశక్తి
బుధవారం 23 ఏప్రిల్ 2025 5 అనంతపురం





నేడు కదిరి ఛైర్‌పర్సన్‌పై...

అవిశ్వాస తీర్మానం..!

◆ సమావేశం నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు

◆ కౌన్సిలర్లకు విప్ జారీ చేసిన వైసిపి

◆ ఎన్నికల అధికారిగా ఆర్డీవో

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి వైసిపిలో ఏర్పడిన ముసలం ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వరకు వెళ్లింది. సొంత పార్టీ కౌన్సిలర్లే ఛైర్‌పర్సన్ తీరును వ్యతిరేకిస్తూ అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశారు. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస పత్రంపై సంతకాలు చేసి ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నాడు అవిశ్వాస తీర్మానంపై చర్చ నడిపేందుకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కౌన్సిలర్లకు ఇప్పటికే సమావేశం నిర్వహణ సమాచారాన్ని అందజేశారు. సొంత పార్టీ కౌన్సిలర్లే ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసంకు సిద్ధం కావడంతో నేడు జరిగే సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. మంగళవారం నాడు వైసీపీ కౌన్సిలర్లు ఎన్నికల అధికారి, ఆర్డీవోను కలిసి ఆ పార్టీ తరపున తమ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ పత్రాన్ని అందించారు. బుధవారం జరిగే అవిశ్వాసానికి మెజార్టీ కౌన్సిలర్లు మద్దతు తెలిపే అవకాశం కన్పిస్తున్న నేపథ్యంలో సమావేశం పూర్తి స్థాయిలో జరుగుతుందా.. లేక ఏవైనా ఆటంకాలు సృష్టించే అవకాశం ఉందాన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మెజార్టీ కౌన్సిలర్ల వ్యతిరేకత

కదిరి మున్సిపాల్టీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో వైసిపి 31 స్థానాల్లో గెలవగా, టిడిపి 5 స్థానాల్లో విజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికల ముందే వైసిపికి చెందిన ఐదుగురు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఆ ప్రకారం మున్సిపల్ కౌన్సిల్‌లో టిడిపి బలం 11కి పెరిగింది. వైసిపికి 25 మంది మద్దతు ఉండగా వీరిలో చాలా మంది ఇప్పుడు ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధం అయ్యారు. సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి ఓటేస్తే సంఖ్యాపరంగా ఛైర్‌పర్సన్ కుర్చీ దిగపోవడం ఖాయంగానే కన్పిస్తోంది.

ముందు నుంచి వ్యతిరేకతే..!

కదిరి ఛైర్‌పర్సన్‌పై ఆ ఆపార్టీ కౌన్సిలర్లలో ముందు నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ఛైర్‌పర్సన్ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదంటూ సొంత పార్టీ కౌన్సిలర్లు పలుమార్లు బహిరంగ విమర్శలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారం కోల్పోయి కూటమి అధికారంలోకి రావడంతో ఛైర్‌పర్సన్‌పై మరింత స్వరాన్ని పెంచారు. అందులో భాగంగానే సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసానికి సిద్ధమయ్యారు.

పట్టణంలో సమస్యల తిష్ట

కదిరి మున్సిపాల్టీలో సమస్యలు తిష్టవేశాయనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా అపరిశుభ్రత కన్పిస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాల్సిన సాధారణ సమావేశాలను సైతం నిర్వహించడం లేదు. అభివృద్ధికి సంబంధించి నివేదికలు తయారు చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి నిధులు కూడా మంజూరు కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నేడు జరుగుతున్న ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రత్యేకతను సంతరించుకుంది.





మట్టి తవ్వకాలు జరపడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డ లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూమి

లేపాక్షి హబ్ భూమి.. మట్టి మాఫియాకు అడ్డేది..?

◆ ఈడీ అటాచ్‌మెంట్ భూమిలో యథేచ్ఛగా తవ్వకాలు

◆ టన్నుల కొద్ది మట్టి తరలింపు

◆ పట్టించుకోని అధికార యంత్రాంగం

మట్టి మాఫియా కన్ను చిలమత్తూరు లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములపై పడింది. ఆ భూముల్లో మట్టిని తోడేసినా అడిగేవారుండరంటూ యథేచ్ఛగా టన్నుల కొద్ది తరలించేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల పేరిట ఏకంగా హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టి కొత్తదందాకు తెరతీస్తున్నారు. పెద్దపెద్ద ప్రొక్లైనర్లు, ఐచర్ వాహనాలు పెట్టి టన్నుల కొద్ది మట్టిని తోడేస్తున్నారు. ఈ భూముల నుంచి బహిరంగంగానే మట్టి తరలి వెళ్తున్నా తమకేమీ సంబంధం లేదన్నట్లు సంబంధిత శాఖల అధికారులు వ్యవహరిస్తుండడం గమనార్హం.

ప్రజాశక్తి-చిలమత్తూరు

పరిశ్రమల ఏర్పాటు పేరుతో చిలమత్తూరు మండల పరిధిలోని శెట్టిపల్లి రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 65,66,80లో లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు రైతుల నుంచి కారుచౌకగా భూములను తీసుకున్నారు. ఎస్ఈజడ్ పేరుతో పేదల నుంచి అతి తక్కువ ధరకు భూములను సేకరించిన ఎపిఐఐసి ఆ భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కట్టబెట్టింది. వారు బ్యాంకుల్లో తనఖా పెట్టి పెద్ద అవినీతి కుంభకోణానికి తెరలేపారు. భూములైతే తీసుకున్నారు గానీ అక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ భూములు ఈడి అటాచ్‌మెంట్‌లో ఉన్నాయి. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న నేపథ్యంలో ఈ భూములను అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా భావించి మట్టిమాఫియా పెద్దపెద్ద వాహనాలతో మట్టిని తోడేస్తున్నారు.

అభివృద్ధి పేరిట అక్రమాలు..

మండలంలో గ్రీన్ లైన్ హైవే, బెంగుళూరు హైవేను అనుసంధానం చేస్తూ సత్యసాయిజిల్లా జిల్లా కేంద్రం నుంచి హైవే పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులు పేరుతో రోడ్డు కాంట్రాక్టర్లు ఏకంగా లేపాక్షి హబ్ భూముల్లో నుంచి మట్టిని తోడేస్తున్నారు. ప్రతి రోజూ టన్నుల కొద్ది మట్టిని తోడి రవాణా చేసుకుంటున్నారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే తాము అభివృద్ధి కార్యక్రమానికే వాడుతున్నామనే సమాధానం విన్పిస్తున్నారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేసేందుకు అనుమతులు ఎవరిచ్చారనేది మాత్రం సందేహాస్పదంగానే ఉంటోంది.



లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల వద్ద ఉన్న ఇటాచీ

> **అభివృద్ధి పేరిట అక్రమాలు..**
>
> మండలంలో గ్రీన్ లైన్ హైవే, బెంగుళూరు హైవేను అనుసంధానం చేస్తూ సత్యసాయిజిల్లా జిల్లా కేంద్రం నుంచి హైవే పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులు పేరుతో రోడ్డు కాంట్రాక్టర్లు ఏకంగా లేపాక్షి హబ్ భూముల్లో నుంచి మట్టిని తోడేస్తున్నారు. ప్రతి రోజూ టన్నుల కొద్ది మట్టిని తోడి రవాణా చేసుకుంటున్నారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే తాము అభివృద్ధి కార్యక్రమానికే వాడుతున్నామనే సమాధానం విన్పిస్తున్నారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు చేసేందుకు అనుమతులు ఎవరిచ్చారనేది మాత్రం సందేహాస్పదంగానే ఉంటోంది.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి



లేపాక్షి నాలెడ్జ్ హబ్ నుంచి ఆక్రమంగా మట్టిని తరలిస్తూ సంపదను కొల్లగొడుతున్న అక్రమార్కులపై ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలి. లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు ఎప్పటికైనా రైతులకు తిరిగి ఇవ్వాల్సినవే. అలాంటి భూముల్లో అక్రమార్కులు మట్టిని తోడేస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదు. అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి.

ఫిరంగి ప్రవీణ్‌కుమార్,
సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కమిటీ సభ్యులు.

అదే దారిలో రియల్టర్లు..!

తమ వెంచర్లను చదును చేసుకునేందుకు రియల్టర్లు సైతం లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టిని తోడేసుకుంటున్నారు. ప్రయివేటు లే అవుట్‌లకు మట్టిని తరలించి వారి భూములను చదును చేసుకుంటున్నారు. సాదారణంగా లేఅవుట్‌కు మట్టిని ఉపయోగించాలంటే టన్నుల చొప్పున ప్రభుత్వానికి రుసుం చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుంది. రియల్టర్లు ఇలాంటివి ఏమీ చేయకుండానే లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో మట్టిని తొడేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


'లెక్క' తప్పుతున్న ఆస్తిపన్ను రాయితీ.?!

కార్పొరేషన్‌లో కంప్యూటర్ మాయాజాలం

వర్తించని 5 శాతం రాయితీ

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంత కార్పొరేషన్‌లో ఏర్పాటుచేసిన కంప్యూటర్లలో ఏం మతలబు ఉందో కానీ ఆస్తిపన్నుకు ఇచ్చే రాయితీలో లెక్క తప్పుతోందని గహ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పుతున్న ఈ లెక్క వినియోగదారులకు నష్టం చేకూర్చేదిగా ఉంటోంది. ఈ మతలబు ఏమిటో అర్థం గాక గహ యజమానులు తలాలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీ లెక్కలో ఆస్తి పన్ను చెల్లించే గహ యజమానికి ఊరట కల్పిస్తుండటంతో గహ యజమానులు మున్సిపల్ కార్పొరేషన్ కౌంటర్లకు క్యూ కడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రోజుకు రూ.70 నుంచి రూ.కోటి వరకు ఆస్తి పన్ను బకాయిలు వసూలు అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు గహ యజమానులు కూడా పన్నులు చెల్లించేందుకు పెద్ద ఎత్తునే కార్పొరేషన్‌కు వస్తున్నారు. అయితే ప్రభుత్వం కల్పించిన రాయితీ పూర్తిస్థాయిలో గృహ వినియోగదారులకు అందడం లేదనే వాదన వన్పిస్తోంది. కార్పొరేషన్‌లో ఇంటి గుత్తలు వసూలు చేసేందుకు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ ప్రకారం ఇక్కడ గుత్తలను సిబ్బంది కట్టించుకుంటూ ఉంటారు. కంప్యూటర్లో టాలీ అన్న సాఫ్ట్‌వేర్ మేరకు బిల్లులు ఇస్తుంటారు. ఇంటి పన్ను అడ్వాన్స్ కట్టిన వారికి ఐదు శాతం రాయితీని ప్రభుత్వ ప్రకటించింది. ఈ నేపథ్యంలో చాలామంది ఇంటి యజమానులు అడ్వాన్స్‌గా గుత్తలను చెల్లిస్తూ ఉంటారు. డోర్ నెంబర్ లేదా అసెస్మెంట్ నెంబర్ చెప్తే గుత్త ఎంత కట్టాలన్నది ఆ కంప్యూటర్‌లో చూసి సిబ్బంది చెబుతారు. వారు చెప్పిన ప్రకారం వినియోగదారులు డబ్బులు చెల్లిస్తూ ఉంటారు. ఐదు శాతం రాయితీ అంటే పదివేల రూపాయలకు 500 రూపాయలు రాయితీ రావాల్సి ఉంటుంది. 15 వేల రూపాయలకు ఐదు శాతం రాయితీ 750 రూపాయలు రావాల్సి ఉంటుంది. ఇటీవల ఓ వ్యక్తి రూ.15,894 గుత్త కట్టాల్సి ఉంది. ఈయనకు ప్రభుత్వం ప్రకటించిన ఐదు శాతం రాయితీ ప్రకారం రూ.795 తగ్గాల్సి ఉంటుంది. అలాకాకుండా కేవలం రూ.502 మాత్రమే తగ్గింది. ఇదేమని సిబ్బందిని ప్రశ్నిస్తే తమకేం సంబంధం లేదని కంప్యూటర్‌లో వచ్చిన మేరకు కట్టాల్సిందే అంటూ సమాధానం ఇస్తున్నారు. కార్పొరేషన్‌లో ఉన్న అన్ని కంప్యూటర్లలో ఇలాగే ఉందా.. లేక గుత్తలు కట్టించుకునే దాంట్లో మాత్రమే ఈ తేడాలు వస్తున్నాయా అన్న సందేహాన్ని గృహ వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. రాయితీ పేరుతో ఇది ప్రభుత్వం చేస్తున్న మోసమా? లేక కంప్యూటర్ల లోపమా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి రాయితీ సక్రంగా వర్తించేలా చర్యలు తీసుకుని గుత్తలు కట్టించుకోవాలని అనంత నగరవాసులు కోరుతున్నారు.



Anantapur Municipal Corporation
RECEIPT

Receipt No. : 04/2025-26/14777
Date : 21-04-2025 01:14:06
Purpose : Property Tax
Assessment No. : 1001061257
Payee Details
Name & Address : Pendekanti Parthasarathi, 17-1-230-1, Venugopal Nagar, Revenue Ward No 17, Anantapur, 515001
Period : Paid From 01-04-2025 to 31-03-2026
Place of Payment : SYSTEM

Amount Payable

Arrears	Current	Interest	Rebate	Total
0.00	15894.00	0.00	502.00	15392.00

Payment Mode

Mode	Cheque / DD / Bank Challan / Online Transaction Number & Date	Bank Name & Branch
cash	NA	NA

Payment Details

	Arrears	Current	Interest	Cheque Bounce Penalty	Rebate / Waiver	Advance	Total
Amount Paid (Rs.)	0.00	15894.00	0.00	0.00	502.00	0.00	15392.00
Balance	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00

Amount Paid (in words): Rupees Fifteen Thousand Three Hundred Ninety Two Only

This is a computer generated receipt, signature is not required.

'Asking Bribe? Call 14400'

'ఎవరైనా లంచం అడిగిన అవినీతికి పాలుపడిన టోల్ ఫ్రీ నెంబర్ 14400 కు ఫిర్యాదు చేయండి'.

ఇటీవల ఓ గృహ వినియోగదారుడు చెల్లించిన ఇంటి గుత్త రసీదు

పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం ద్వారా అందే వివిధ రకాల సేవలను పారదర్శకంగా ప్రజలకు అందించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జిల్లాలోని తహశీల్దార్లు, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారులు, విలేజ్ సర్వేయర్లతో ఐవిఆర్ఎస్‌కు సంబంధించి కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ సర్వీసులు, పథకాలకు సంబంధించి ప్రజల నుంచి వారి అభిప్రాయాన్ని ఐవిఆర్ఎస్ ద్వారా గత మూడు నెలలుగా సర్వే చేయడం జరుగుతున్నదన్నారు. దీనిని పకడ్బందీ ప్రభుత్వం సూచించిన మేరకు నిర్వహించాలని తెలియజేశారు. ఐవిఆర్ఎస్ నెగిటివ్ ఫీడ్ బ్యాక్ ద్వారా వచ్చినటువంటి ప్రాంతానికి వెళ్లి మళ్లీ పరిశీలన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, డిఆర్ఒ ఎ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, సర్వే ఏడీ రూప్ల నాయక్, ఏఎస్ఒ జగన్మోహన్ పాల్గొన్నారు.

న్యూఢిల్లీకి కలెక్టర్

న్యూఢిల్లీలో బుధవారం జరగనున్న సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలకు సంబంధించి యుపిఎస్సీ నిర్వహించే సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు అనంత కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ వెళ్లారు. దేశంలోని 77 జిల్లాల నుంచి ఆయా కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు అనంత కలెక్టర్ మంగళవారం న్యూఢిల్లీకి వెళ్లారు.

పారిశుధ్యం, అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్య మెరుగుతోపాటు అభివృద్ధి పనులపై దష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. మంగళవారం నగరంలోని 37వ డివిజన్‌లో కమిషనర్ బాలస్వామితో కలిసి పారిశుధ్య పనులు, రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించారు. అదేవిధంగా రామ్‌నగర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లైఓవర్ కింద ఎన్ క్యాప్ నిధులు రూ.34 లక్షలతో చేపడుతున్న గ్రీనరీ పనుల డిజైన్ మ్యాప్‌ను పరిశీలించి త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, రోడ్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బిఎల్ నరసింహులు, షాకీర్, డిప్యూటీ ఇంజినీర్ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ ఇంజినీర్ హరీష్, కమ్యూనిటీస్ సెక్రటరీలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటేష్, సచివాలయ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామి

శ్రీరామిరెడ్డి కార్మికుల కష్టాలు పట్టవా..?

◆ బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలి

◆ కార్మికుల ఆందోళనకు సిఐటియు, సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ మద్దతు



కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పెండింగ్ వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని 17 రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీటి తాగునీటి సరఫరా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, అధికారులకు పట్టదాని వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు టవర్‌క్లాక్ సర్కిల్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మండుటెండలోనే కార్యాలయం ఎదటు బైటాయించి నిరసన తెలిపారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకుని గేటు వద్ద రోడ్డుపై బైటాయించి ప్లకార్డులు చేపట్టి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ డా॥ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రాజారెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఏసురత్నం, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్ర కుమార్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్న తాగునీటి కార్మికుల సమస్యలు ఒకటి పరిష్కారం కాలేదన్నారు. కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. వేతనాలు ఇవ్వకపోవడంతో గత్యంతరం లేక కార్మికులకు సమ్మెలోకి వెళ్లారన్నారు. ఈ క్రమంలో నీటి సరఫరా నిలిచి గ్రామీణులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రజల కోసమైనా పాలకులు ఆలోచించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. తక్షణం శ్రీరామ్‌రెడ్డి కార్మికులకు పెండింగ్ వేతనాలు, పిఎఫ్ చెల్లించి రెగ్యులరైజ్ చేయాలన్నారు. కాంట్రాక్టర్‌లు కలాం నాయుడు, శివ శంకర్‌రెడ్డి, శివారెడ్డిలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సమస్యలపై ఇప్పటి వరకు శాంతియుతంగానే నిరసన తెలుపుతున్నామన్నారు. ఉధృత ఆందోళన వైపు కార్మికులను నడిపించకుండా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బిహెచ్.రాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కష్ణమూర్తి, సిఐటియు ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రిస్వామి, రాము, వన్నూరప్ప, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

జిల్లాలోకి గంజాయి రాకూడదు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఇతర ప్రాంతాల నుంచి ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలోకి గంజాయి రాకుండా చర్యలు చర్యలు తీసుకోవాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో అనంతపురం త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్ స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా అనంతపురంలో పోలీసులు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో సుశిక్షణ పొందిన షైనీ జాగిలం ద్వారా జిల్లా కేంద్రం గుండా వెళ్లే రైళ్లలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఒడిస్సాలోని భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు అనంతపురం మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్ ప్రెస్ రైలులో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణికులకు అసౌకర్యం కల్గకుండా ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరగకుండా లోతుగా చెక్ చేశారు. అనుమానాస్పదులు, వారి లగేజీలను షైనీ జాగిలం ద్వారా తనిఖీ చేశారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

డీఎస్సీ నోటిఫికేషన్‌పై విమర్శలు బాధాకరం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదని వైసిపి నాయకులు ఇటీవల కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకనలో ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం రోజు నిరుద్యోగులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన బహుమతి డీఎస్సీ నోటిఫికేషన్ అన్నారు. ఉపాధ్యాయ పోస్టులు ఎప్పటికైనా సాధించాలనే కలతో గత ఆరేళ్లు ఎంతోమంది నిరుద్యోగులు వేచి చూశారన్నారు. తాము ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం 16,346 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. పైగా వారిపై కేసులు పెట్టించే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు నిరుద్యోగులకు కలల సాకారం చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేయాల్సిందిపోయి వైసీపీ నాయకులు ఇంకా సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నారని దగ్గుపాటి ధ్వజమెత్తారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జడ్జికి బొకే అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం : అనంతపురం జిల్లా జడ్జి భీమారావును ఎస్పీ పి.జగదీష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా జిల్లా కోర్టులోని జడ్జి ఛాంబర్‌లో జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధిత ప్రజలకు న్యాయం, నిందితులకు శిక్షలు పడేలా ఇరుశాఖల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేద్దామని, ఇరుశాఖల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొనేలా సమన్వయంతో ముందుకెళ్దామని జడ్జి, ఎస్పీలు ఆకాంక్షించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఉద్యానవన శాఖలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి శైలజ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి ఉద్యావన శాఖ ఆధ్వర్యంలో పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే నూతన పండ్లతోటల పెంపకంలో భాగంగా డ్రాగన్ ఫ్రూటు, అవకాడ, అంజూరా, నేరేడు, బొప్పాయి, ద్రాక్ష, మామిడి వంటి పంటల సాగు చేసుకున్న రైతులకు 40శాతం మెయింటనెన్స్ రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే పండ్ల మొక్కల అంట్లు, మొక్కల ఉత్పత్తిని పెంపొందిచేందుకు నర్సరీ యూనిట్లు, పాలిహౌస్, షేర్‌నెట్ నిర్మాణాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్ల పరిశీలన



అనధికార లేఅవుట్లను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా నిబంధనలు పాటించకుండా అక్రమంగా వేసిన లేఔట్లపై చర్యలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, వైస్ ఛైర్‌పర్సన్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గుర్తించిన రేకులకుంట సర్వేనెంబర్ 260, దయ్యాలకుంటపల్లి సర్వేనెంబర్ 117, చెన్నంపల్లి సర్వేనెంబర్ 435/1, నార్పల సర్వేనెంబర్ 11, 24, సర్వేనెంబర్ 5,6, సర్వే నెంబర్ 22, 23, సర్వే నెంబర్ 4లో వేసిన అనధికార లేఔట్లలో వేసిన రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ మాట్లాడుతూ అనధికార లేఔట్ల విషయంలో ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. అహుడా నిబంధనలకు లోబడి అనుమతులు తీసుకొని పక్షంలో చట్టపరంగా ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, జెపిఒ హరీష్‌చౌదరి, ప్లానింగ్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎపిడి పుల్లారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచడంతోపాటు గతలో ఉన్న సంస్కరణలను వదిలి నూతన సంస్కరణలను అవలంభించాలన్నారు. ముఖ్యంగా వారంతపు సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. అలాగే ఫారంపాండ్‌లపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై 50శాతం ఫారంపాండ్‌లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్లు జయరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, కుళ్లాయిస్వామి, సిఒలు చంద్ర, గిరి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోప్ మృతికి కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రోమ్ బిషప్ రోమన్ కేథలిక్ చర్చి మతాధికారి, వాటికన్ నగర అధ్యక్షుడు పోప్ ఫ్రాన్సిస్ మృతికి కెవిపిఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మంగళవారం టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రంధాంజలి ఘటించి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు జీవరత్నం, ఆది, రాజా, డేవిడ్ హాజరై మాట్లాడుతూ పోప్ ఫ్రాన్సిస్ గొప్ప ప్రజా సేవకుడని కోట్లాది మంది ఆదరాభిమానాలు పొందారని తెలిపారు. విద్యా వైద్యం ఆశ్రమాలు, చర్చి మందిరాలు నిర్వహిస్తూ సేవలు అందించారని కొనియాడారు. పోప్ మృతి సమాజానికి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వెంకటేష్, సిఐటియు నాయకులు వెంకటనారాయణ, కుమార్, నూరుల్లా, ఆజాం, నారాయణస్వామి, పవన్, ఇమ్రాన్, అశోక్, సాయి, డానియల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు బీకేఎస్ విద్యార్థి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఈనెల 22 నుంచి 27వతేదీ వరకూ ఢిల్లీలో జరిగే స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో బుక్కరాయసముద్రం ఉన్నత పాఠశాల విద్యార్థి పి.మోహన్ పాల్గొననున్నారు. గతేడాది నవంబర్ 9 నుంచి నవంబర్ 11వతేదీ వరకూ గుంటూరు జిల్లా యనమదలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల పోటీల్లో మోహన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలో కూడా ప్రతిభ కనబరిచి విజయంతో తిరిగి రావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

పుట్లూరు : మండల పరిధిలోని గాండ్లపాడు, వెంగన్నపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో బయటపడిన గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యమైంది. నార్పల మండలం పులుసులనూతల గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాల్సిందే..

పామిడి : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాల్సిందేనని పామిడి యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు కమ్యూనిస్టు నాయకుడు రహీమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకపక్షంగా బిల్లులు ఆమోదించడం అత్యంత దారుణమన్నారు. లౌకిక శక్తులు ఏకమై వక్ఫ్ సవరణ బిల్లు ఉపసంహరించుకునేంత వరకూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మండల సమావేశం

కళ్యాణదుర్గం రూరల్ : ఎంపిడిఒ గూడెన్న అధ్యక్షతన కంబదూరు మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనులు, పి-4 సర్వే, పింఛన్ల మొత్తం జమ వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా, డివిజనల్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావు, ఎఒ తిప్పయ్య, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జిడిఎస్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జిడిఎస్ ఉద్యోగులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

జిడిఎస్ ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఉప తపాలా కార్యాలయం ముందు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పెన్షన్ స్కీమ్ ఎస్‌డిబిఎస్‌కు బదులుగా ఎన్‌పిఎస్, యుపిఎస్ నెలవారీ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, జిడిఎస్ ఉద్యోగులను ఎనిమిది గంటలు పని ఉద్యోగులుగా పరిగణించాలని, వీడియోస్ ఉద్యోగుల జీతభత్యాలను ఎనిమిదో వేతన కమిటీ పరిధిలో లెక్కించాలని, డిపార్ట్మెంట్ ఉద్యోగులతో సమానంగా టైం బౌండ్ ఫైనాన్స్ పాప్ గ్రేడియేషన్ అమలు చేయాని డిమాండ్ చేశారు. జిడిఎస్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని, లాప్‌టాప్ ప్రింటర్, బ్రాడ్‌బ్యాండు వైర్‌లెస్ నెట్‌వర్క్ సౌకర్యాలు బిఒలకు కల్పించాలని, బ్రాంచ్ పోస్టాఫీసులను అధునికరించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమ్లానాయక్, జయరాములు, శివానంద, రామకృష్ణ, గాయత్రి, మోహన్‌కృష్ణ, మస్కిన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

కమిషనర్, డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వ్యాపార సముదాయాలు, ముఖ్యమైన కూడళ్లు, దుకాణాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ బాలస్వామి, డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిల్ హాలులో నగరంలోని వ్యాపారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా వ్యాపారులు భాగస్వాములు కావాలన్నారు. నగరంలోని 40 కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కూడల్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్, క్రైమ్ సమస్యల నివారణకు దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా లక్కీ-9 హోటల్ యజమాని సుధాకర్‌రెడ్డి, లోవరాజ్, మనప్పురం జ్యువలరీ మేనేజర్, కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా తమ వంతు బాధ్యతగా చేరొక కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. మిగిలిన వారు తమ యాజమాన్యంతో మాట్లాడి తమ వంతు బాధ్యతను నెరవేర్చగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, ఎస్ఇ చంద్రశేఖర్, ఇఇ షాకీర్ హుస్సేన్, డీఎస్పీ శ్రీనివాసులు, వ్యాపారులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉన్న రఘు సైనిక్ స్కూల్‌లో మంగళవారం పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 21 సెంచిరి ఐఎఎస్ కృష్ణప్రదీప్, చీఫ్ మెంటర్ డాక్టర్ భవానీశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నిక చేసుకున్న కొన్ని పాఠశాలలకు మాత్రమే తమక కంటెంట్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఐఎఎస్, ఐపీఎస్ లాంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను చిన్నప్పుడు నుంచే సన్నాహం ఎలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రయివేట్ పాఠశాల సంఘం గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా కోశాధికారి రామచంద్ర, ఉమ్మడి జిల్లా సిఆర్ఒ రవిచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, తాడిపత్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఆకులేడు శేషాద్రిరెడ్డి, జిల్లా ఉప కార్యదర్శులు బాబయ్య, రాయదుర్గం బాషా, శ్రీచైతన్య నరేంద్ర, సత్యసాయి జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి, డిసిఇబి సభ్యులు వేణుగోపాల్, ఉప కార్యదర్శులు బత్తలపల్లి లక్ష్మీనారాయణ, లక్ష్మి, సోమందేపల్లి వనజ, తాడిమర్రి వెంకటేష్, నగర గౌరవాధ్యక్షులు శ్రీవాత్సవకుమార్, ప్రధాన కార్యదర్శి సుజాత విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జానకిరాములు, ఎస్ఎండి రఫీ, సభ్యులు ఈశ్వరి, నూర్జహాన్, సునంద దేవి కళావతి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాలు



యల్లనూరు మండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంతోపాటు అచ్యుతాపురం గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్‌వైజర్ రాజమణి వెయ్యి రోజుల సంరక్షణ, ప్రాముఖ్యత, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీలు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట, బొందలవాడ సెక్టార్ అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లువచ్చే వరకూ దాదాపు వెయ్యి రోజులు కీలకమైన రోజులు అన్నారు. కావున మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, మాంసం, గుడ్లు వంటి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు డి.శ్రీదేవి, డి.భారతి, నాగమణి, రామాంజనమ్మ, లలితమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని సొరకాయలపేట గ్రామంలో మంగళవారం పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై కళాకారులు తమ జాతా ద్వారా వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, కళాజాతా బృందం పాల్గొన్నారు.

సిహెచ్‌ఒలను రెగ్యులరైజ్ చేయాలి

ధర్నాకు సిఐటియు, డివైఎఫ్ఐ మద్దతు



ధర్నాకు మద్దతు తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైద్య ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా విలేజ్ సబ్ సెంటర్, పిహెచ్‌సిల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లను రెగ్యులరైజ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గణేష్, సాహీబా ప్రియాంక, గౌరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిహెచ్‌ఒలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వీరి ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపిఎంసిఏ నేతలు గణేష్ మాట్లాడుతూ ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లుగా పని చేస్తున్న వారికి 2 సంవత్సరాలుగా వేతనాలు చెల్లింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. 2023లో ఎన్‌హెచ్‌ఒలకు 23 శాతం వేతన సవరణ ఇచ్చినప్పటికి అమలు చేయకపోగా ప్రతి నెలా ఇవ్వాల్సిన వేతనాలు కూడా ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఆయుస్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు సర్వీస్ పూర్తైన వారందరికి రెగ్యులరైజ్ చేయాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఈపిఎఫ్ఒను పునరుద్ధరించాలన్నారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలన్నారు. హెచ్ఆర్ పాలసి ఇంక్రిమెంట్‌లు, ట్రాన్ఫర్‌లు తదితర అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంసిఏ సభ్యులు సువర్ణ, సత్యమయ్య, లక్ష్మీనారాయణ, నాగరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎడిఎ



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రకృతిని రక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని అనంతపురం వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.రవి పిలుపునిచ్చారు. ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా మంగళవారం 'మన భూమిని పునరుద్ధరించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు స్థిరమైన, పర్యావరణ అనుకూల ప్రయత్నాలను చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ వాతావరణ మార్పు, అటవీ నిర్మూలన, కాలుష్యం, జీవ వైవిధ్య నష్టం వంటి అంశాలు భూగ్రహాన్ని బెదిరిస్తున్నాయన్నారు. ఈ సమయంలో ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, గార్లదిన్నె వ్యవసాయ అధికారి సోమశేఖర్, రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ : మట్టి పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ సూచించారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని ఆర్.కొట్టాల గ్రామంలో మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్ష ఫలితల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ సూక్ష్మ పోషకాల ఉపయోగం, సేంద్రియ కార్బణం యొక్క ప్రాధాన్యతపై వివరించారు. పంట పొలాల్లో రైతులు ప్రయివేట్ వ్యక్తుల సూచనలు, సలహాలతో రకరకాల ఎరువులు వాడుతూ నష్టపోకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం 35 చేసిన ఎరువులు వాడి ఆర్థికంగా బలోపేతం చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, రైతులు రాజగోపాల్, శీనా, జయసింహా, మురళి, ఎర్రిస్వామి, ఎఇఒలు రాఘవేంద్ర, కైలాష్‌నాథ్, వివిఎ కుళ్లాయినాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపిస్తా : జెఎన్‌టియు విసి



విసిని సన్మానిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియుని అభివృద్ధి పథంలో నడిపించి రాష్ట్ర ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నారాయణరెడ్డి అధ్యక్షతన ఎన్టీఆర్ ఆడిటోరియంలో విసిని ఘనంగా సత్కరించారు. అందరికీ అన్ని విధాలుగా అందుబాటులో ఉండి విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ విసి హెచ్.సుదర్శనరావు ఉన్నతమైన విద్యను అభ్యసించి 42 సంవత్సరాల తన బోధన, పరిశోధన అనుభవంతో మంచి సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. మున్ముందు యూనివర్సిటీని మరింత విజయపథంలో నడిపించగలరని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, విసి ఒఎస్‌డి ఎన్.దేవన్న, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, టీచింగ్ స్టాఫ్ ప్రెసిడెంట్ టి.నారాయణరెడ్డి, సెక్రటరీ శారద, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

పుట్లూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయానికి రూ.50 వేలు విలువజేసే పుస్తకాలను విరాళంగా ఇచ్చిన బాలాపురం పంచాయతీ కార్యదర్శి పి.వెంకట్‌నాయుడును మంగళవారం గ్రంథాలయ పాఠకులు, నిరుద్యోగులు ఘనంగా స్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రేమ్‌కుమార్, భూమిరెడ్డి ట్రస్ట్ సభ్యులు పెద్దనాగిరెడ్డి, రవికుమార్, గ్రంథాలయ అధికారి జయరాములు, మడ్డిపల్లి జగదీష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి : ఎంపిడిఒ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని 11 సచివాలయాల సిబ్బంది సిటిజన్ ఇకెవైసి సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ నందకిషోర్ సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిజన్ ఇకెవైసిపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, మనమిత్రలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధినేతర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.రుద్రాక్షి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు విద్యాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

శింగనమల : సమగ్ర శిక్ష అనంతపురం వారి ఆదేశాల మేరకు స్థానిక కెజిబివిలో వివిధ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ నరసింహరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ కుక్-1, అసిస్టెంట్ కుక్ - 3, వాచ్‌మెన్ -1, టైపిస్టులు 4, చౌకీదార్-1, అసిస్టెంట్ కుక్-1 వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 01-07-2024 నాటికి 42ఏళ్ల వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలనికోరారు. కేవలం స్థానిక మహిళలు మాత్రమే ఉండాలన్నారు. ఈనెల 30వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సిసి సూచిక బోర్డు ఏర్పాటు

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు మంగళవారం ఎన్‌సిసి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్‌సిసి మొదటి సంవత్సరం క్యాడేట్స్‌కు యూనిఫామ్, ట్రాక్‌సూట్, టీషర్టులు, డిఎంఎస్ షూ, పిటి షూ, ఇతర సామగ్రిని అందజేవారు. ఈ కార్యక్రమంలో పామిడి పంచాయతీ ఇఒ గోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, ఎన్‌సిసి అధికారి రామాంజనేయులు, పూర్వ విద్యార్థులు షఫీ, శ్రీనివాసులు, ఎక్స్ ఆర్మీ లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ

పామిడి : 2024 - 25 విద్యా సంవత్సరంలోని దసరా సెలవుల సమయంలో వృత్తి విద్య శిక్షణ తీసుకున్న స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రామకుమార్, సీనియర్ ఉపాధ్యాయురాలు ఎన్.భాగ్యలక్ష్మి, వృత్తి విద్య ఉపాధ్యాయులు సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌ఆర్‌సి గుర్తింపు కార్డులు పంపిణీ

యాడికి : మండల కేంద్రంలోని కోన రోడ్డు ప్రధాన కూడలిలో ఉన్న పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కమిటీ కార్యాలయంలో మంగళవారం పలువురికి ఐడీ కార్డులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ హ్యూమన్ రైట్స్ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పేరం సుధాకర్‌రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రెటరీ గుండా నారాయణస్వామి, జిల్లా లేబర్ వింగ్ పార్లమెంటు ప్రెసిడెంట్ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి, వారికి అన్ని విధాల సాయం అందించాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు కెబిడి రామిరెడ్డి, లింగం చంద్రశేఖర్, కుండా లక్ష్మీనారాయణ, కాలవ శ్రీనివాసులు, తిరుమలేశు, దాసరి గణేష్, మూలింటి శివప్రసాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుత్తి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపిడిఒ డి.ప్రభాకర్‌నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవిలో ఎండల తీవ్రతకారణంగా కార్యాలయానికి వచ్చే ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడకుండా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవి పూర్తి అయ్యేవరకు చలివేంద్రం ద్వారా ప్రజలకు నీటిని అందిస్తామన్నారు. వివిధపనుల నిమిత్తం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, వివిధశాఖల సిబ్బంది, అధికారులు చల్లటి నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రమేష్, ఇసి ప్రభాకర్, టిడిపి నాయకులు ఎంకె చౌదరి, చికెన్ శీనా, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కెజివివిల్లో వైద్య ఆరోగ్య శాఖ మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి, కెజిబివి ప్రిన్సిపాల్ మాధవి, పిహెచ్‌సి లలితమ్మ, నారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్ బాషా, కిరణ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన యువరైతు బోయ మాలింగ (35) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. బంధువులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యువరైతు మాలింగ తన వ్యవసాయ పొలంలో రెండెకరాల్లో పత్తి పంట సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వ్యవసాయ తోటలో విద్యుత్ మోటార్ బాక్స్‌లో మోటార్ స్విచ్‌ను ఆన్‌చేయగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య అంజనమ్మ, కుమారుడు అజిత్ ఉన్నారు. సమాచారం తెలుసుకున్న బ్రహ్మసముద్రం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతుని భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీకి గాయాలు

బెలుగుప్ప : మండల కేంద్రానికి చెందిన బోయ గోవిందు మంగళవారం ఉపాధి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి గాయపడ్డాడు. వెంటనే తోటి కూలీలు స్థానిక వైద్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎపిఒ మురళీకృష్ణ మాట్లాడుతూ గోవిందుకు ఎన్ని రోజులు బెడ్‌రెస్ట్ ఉంటే అన్ని రోజులు ఉపాధి పనుల్లో అర్ధభాగం నగుదు చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు.